## రెండు కోట్లు స్టాంప్ డ్యూటీ బకాయిలు



ప్రభాతవార్త చాట్రాయి
చాట్రాయి మండలంలోని 18 పంచాయితీలకు గాను స్టాంప్ డ్యూటీ బకాయిలు రెండు కోట్లకు పైగా ఉన్నట్లు అధికార గణాంకాలు తెలియజేస్తున్నాయి.
గ్రామాలలో భూముల క్రయ విక్రయాలు జరిగి రిజిస్ట్రేషన్లు జరిగినప్పుడు ప్రభుత్వం కట్టించుకునే రిజిస్ట్రేషన్ పైకంలో పంచాయతీలకు కొంత సొమ్ము కేటాయిస్తారు. ఆ సొమ్ము గత మూడు సంవత్సరాలుగా పంచాయతీలకు జమ కాకపోవడంతో పంచాయతీలలో నిధులు కొరతతో అల్లాడుతున్నాయి. ప్రభుత్వం నుండే వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయతీలకు ఎందుకు జమ చేయరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి కట్టిన రిజిస్ట్రేషన్ పైకంలో మండల పరిషత్ కు కూడా వాటా ఉంటుంది. కానీ ప్రభుత్వం ఈ సొమ్ము పంచాయతీలకు చెల్లించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తుందని దీనిపై పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో పంచాయతీల పరిస్థితి అధ్వానంగా మారింది. పారిశుధ్యంతో పాటు, తాగునీటి సమస్య ఏర్పడిన పంచాయితీలలో పైసా లేకపోవడంతో స్పెషల్ ఆఫీసర్లు పట్టించుకోవటం లేదని ఆరోపణలు వినవస్తున్నాయి. పంచాయతీ మోటర్లు కాలిపోతే రోజులు తరబడి కట్టించక పోవటంతో ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారు. పంచాయతీలకు రాబడి రాకపోవడంతో గ్రామాలలో పలు అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని మంత్రి పార్థసారథి దీనిపై దృష్టి సారించి పంచాయతీలకు, మండల పరిషత్తులకు నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**ఈఓపీఆర్డి వివరణ**

ఈ విషయంపై మండల విస్తరణ అధికారి నాగరాజును ప్రభాతవార్త వివరణ త్వరగా బకాయిలు ఉన్న మాట వాస్తవమేనని గత మూడు సంవత్సరాల నుండి నిధులు జమ కావడం లేదని చెప్పారు.

## స్త్రీ శక్తి పథకం అమలుకు బస్సుల సంఖ్య, సిబ్బందిని పెంచాలి



**భీమవరం టౌన్, మే 18 : ప్రభాతవార్త** దీర్ఘకాల అపరిష్కృత డిమాండ్ల సాధనకై వీధి పోరాటాలకు వెనుకాడబోమని, దశల వారీ ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ సెక్రటరీ అల్లం సత్యనారాయణ హెచ్చరించారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ లో డిఆర్ఓ ఎం.శివన్నారాయణ రెడ్డికి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ పిఆర్సీ నియమించి మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం బకాయిలను, డిఎ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని మూసివేసే దిశగా ప్రభుత్వం వెళ్తున్నట్టు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు మాటలపై తెలుస్తుందని ఆర్టీసీ పరిరక్షణకు ఎంతవరకయినా వెళ్తామని ఆయన హెచ్చరించారు. కార్మికులకు గతంలో ఇచ్చిన వైద్య సదుపాయాలు పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ బస్సులను నిర్వహణ ప్రైవేట్ ఆపరేటర్లకు ఇవ్వరాదని, స్త్రీ శక్తి పథకం వలన ఏర్ప డే ఇబ్బందుల్లో ఉద్యోగులకు ఇచ్చే పనిష్మెంట్లు ఆపాలని, స్త్రీ శక్తి పథకం పెట్టినందున బస్సుల సంఖ్య, సిబ్బంది సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతపై గతంలో ఇచ్చిన సర్కులర్1 బై 2019 అమలు చేయాలని, గ్రేడ్ 2 మెకానిక్ లకు ఏఏఎస్ ఇంక్రిమెంట్ లో జరిగిన అన్యాయం అరికట్టాలని, వారికి లీడింగ్ హ్యాండ్ తో సమానంగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ ద్వారా ఏర్పడుతున్న అన్ని కేటగిరీల ఖాళీలను భర్తీ చేయాలని, ఆన్ డ్యూటీ సిబ్బందిపై దాడులు అరికట్టాలని, కాలం చెల్లిన ట్రిమ్ములు రీప్లేస్ చేయాలని, ఐఆర్ ప్రకటించి పిఆర్సీకి కమిషన్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కే.ఎస్.రాజు, ఏ.రాంబాబు, స్టీవెన్ రాజు, ఎం.రమణ ఎం.నవరత్నం, పి.వి.రావు, కె.వి.ఆర్.రాజు, జె.కే.రావు, ఎం.సీతారాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న నాటకశాల వెంకట్రాజు

**తలసేమియా బాధితునికి ?5 లక్షల భారీ సాయం**



**కొయ్యలగూడెం రూరల్ మే 18 ప్రభాత వార్త** ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందిన బాబు ని కాపాడేందుకు అదే గ్రామానికి చెందిన ఛత్రపతి సేవా సమితి అధ్యక్షుడు నాటకశాల వెంకట్రాజు కొండంత అండగా నిలిచారు. నిరుపేద కుటుంబానికి ?5 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అందించి, తనలోని అపారమైన మానవత్వాన్ని, సేవా గుణాన్ని మరోసారి చాటుకున్నారు. ?ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బయ్యానగూడెం గ్రామానికి చెందిన సింగంశెట్టి రామాంజనేయులు, కృష్ణకుమారి దంపతులకు మణికంఠ ఒకే ఒక్క బాబు. రెక్కాడితే గాని డొక్కాడని ఆ మధ్యతరగతి కుటుంబం, కష్టపడితేనే ఇల్లు గడిచే పరిస్థితి. అటువంటి కుటుంబంలో ఒక్కగానొక్క కుమారుడు మణికంఠకు తలసేమియా వ్యాధి రావడం ఆ తల్లిదండ్రులకు కోలుకోలేని లోటుగా మారింది. పుట్టిన రెండేళ్ల వయసు నుండే ఆ బాబు ఈ మహమ్మారితో నరకయాతన అనుభవిస్తున్నాడు. ఈ నెలలోనే ఆపరేషన్ చేయించకపోతే బాబు ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు తేల్చి చెప్పారు. శస్త్రచికిత్సకు ?22 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలియడంతో, ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న ఆ కుటుంబ పరిస్థితిని గమనించి బయ్యానగూడెం గ్రామ పెద్దలు, యువత, రాజకీయ నాయకులు పార్టీలకు అతీతంగా స్పందించి సుమారు ?15 లక్షల వరకు విరాళాలు సేకరించారు. అయితే ఆపరేషన్‌కు ఇంకా ?5 లక్షల కొరత వేధిస్తున్న తరుణంలో, ఈ విషయం నాటకశాల వెంకటరాజు దృష్టికి వెళ్ళింది. ఆ చిన్నారి ప్రాణం నిలవడం కోసం తన వంతు బాధ్యతగా ?5,00,000/- (ఐదు లక్షల రూపాయల) నగదు సహాయాన్ని నాటకశాల వెంకట్రాజు ఉదారంగా ప్రకటించారు. సోమవారం ఉదయం బయ్యానగూడెం గ్రామంలో గ్రామ పెద్దలు, మీడియా బాబు తల్లిదండ్రుల సమక్షంలో ఈ భారీ నగదు మొత్తాన్ని నేరుగా తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా నాటకశాల వెంకట్రాజు మాట్లాడుతూ. ఒక మధ్యతరగతి కుటుంబంలోని ఏకైక చిన్నారి ప్రాణాన్ని కాపాడటం కోసం గ్రామం అంతా ఏకతాటిపైకి రావడం అభినందనీయమని, ఆపరేషన్‌కు అవసరమైన మిగిలిన ?5 లక్షల మొత్తాన్ని ఛత్రపతి సేవా సమితి తరపున అందించడం సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. బాబు త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కష్టాల్లో ఉన్న తమ కుటుంబానికి దేవుడిలా వచ్చి ఇంతటి భారీ సహాయాన్ని అందించిన నాటకశాల వెంకటరాజుకు బాబు తల్లిదండ్రులు రామాంజనేయులు, కృష్ణకుమారి కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. సొంత ఊరి బిడ్డగా నాటకశాల వెంకట్రాజు చేసిన ఈ గొప్ప సాయంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# ఐదేళ్లలో పెట్రోల్, డీజిల్ పై భారాలు వేసిన దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వం

## వైసిపి నేతలు చేస్తున్న విన్యాసాలు హాస్యాస్పదం - తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ధ్వజం



**తణుకు, మే 18 ( ప్రభాత వార్త)**
గత ఐదేళ్ల వైసీపీ పాలనలోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ రాధాకృష్ణ ధ్వజమెత్తారు. దేశంలోనే అన్ని రాష్ట్రాల్లో పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గిస్తే వైసిపి హయాంలో మాత్రం జగన్మోహన్ రెడ్డి తగ్గించకపోవడం దారుణమని అన్నారు. సోమవారం కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగాయని వైఎస్ఆర్సిపి నాయకులు మొసలి కన్నీరు కార్చుతూ చేస్తున్న విన్యాసాలు హాస్యాస్పదంగా ఉన్నాయని అన్నారు. కనీస అవగాహన లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ధరలు పెంచిందని ధర్నాలు చేయడం సరికాదన్నారు. దోచుకో దాచుకో తినుకో జగన్మోహన్ రెడ్డి పేటెంట్ హక్కుగా తీసుకున్నారని ఇదే వ్యవహారాన్ని కింది స్థాయిలో నాయకులు అమలు చేస్తున్నారని చెప్పారు ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని గతంలో మద్యం రవాణా వ్యవహారంలో వైసిపి నాయకులు దోచుకున్నారని విమర్శించారు ప్రభుత్వంపై విమర్శలు చేసే అధికారం అర్హత వైసిపి నాయకులకు లేదని అన్నారు. 2019 నుంచి 2024 మధ్యకాలంలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో పెట్రోల్, డీజిల్ ఐదేళ్ల కాలంలో ఎంత పెంచారో గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు రోడ్డు సెస్సు రూపాయి వసూలు చేసి కనీసం రోడ్డు కూడా నిర్మించకుండా విధ్వంసం చేసి దోచుకున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా లీటర్ డీజిల్, పెట్రోల్ పై ఒక రూపాయి వసూలు చేశారని ఆరోపించారు.
పశ్చిమాసియా దేశాల్లో యుద్ధం కారణంగా క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 80 డాలర్ల నుంచి 100 డాలర్లు పైగా పెరిగిందని గుర్తు చేశారు. గత రెండు నెలలుగ అత్యధికంగా పెరిగిన పరిస్థితుల్లో కేంద్రం తీసుకున్న నిర్ణయం మేరకు పెట్రోల్ డీజిల్ పై మూడు రూపాయలు పెంచినట్లు తెలిపారు. ప్రజలపై ఆర్థిక భారం పడుతున్నప్పటికీ కూడా తప్పని పరిస్థితుల్లో ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకొని ప్రజలు అవగాహన చేసుకునే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇంధనం కొరత ఏర్పడే పరిస్థితుల్లో పొదుపుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నో చర్యలు తీసుకుని ఇంధనం పొదుపు కోసం కృషి చేస్తుందని చెప్పారు. 2023 మే నెలలో 111.50 లీటర్ పెట్రోల్, లీటర్ డీజిల్ రూ. 99.27 ధర ఉందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెస్సు, వ్యాట్ 31 శాతం మాత్రమే వసూలు చేస్తుందని చెప్పారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో దేశంలోని 23 రాష్ట్రాలు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తే జగన్మోహన్ రెడ్డి మాత్రం కనీసం ధరలు తగ్గించకపోవడం దారుణమని అన్నారు. కేంద్రం పెంచిన ధరలను ప్రజలు అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాధాకృష్ణతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు..

## ఉప్పు తగ్గించండి ముప్పుకు దూరంగా ఉండండి



**భీమవరం టౌన్, మే18 : ప్రభాతవార్త** ఉప్పు తగ్గించడం ద్వారా రక్తపోటు అనే ముప్పుకు దూరంగా ఉండవచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు.ప్రపంచ రక్తపోటు దినోత్సవ వారోత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్లో పి.జి .ఆర్ .ఎస్.కు విచ్చేసిన ప్రజలకు ఏర్పాటుచేసిన శిబిరంలో బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహించారు, ఈ సందర్భంగా వైద్యాధి.కారులు ప్రజలకు ఆరోగ్య సంబంధిత పలు సూచనలు తెలియజేశారు ఎప్పటికప్పుడు బి .పి , షుగర్ పరీక్షలు చేయించుకుని ఆరోగ్య సూత్రాలను పాటించాలని, ప్రతి రోజు వ్యాయామం చేయాలనీ , ఉప్పు తగిన మోతాదు లో తీసుకోవాలని , పొగ కాల్చడం ,మద్యం సేవించడం వంటి పనులకి దూరంగా ఉండాలని జనాలకి అవగాహన కల్పించారు, అందరికి ఓ .ఆర్.ఎస్.ప్యాకెట్ల పంపిణి చేసారు .ఈ కార్యక్రమం లో జిల్లా ఎపిడెమియాలజిస్ట్ గాతల సుభాష్, మారుతీ నగర్ యూపి ఎచ్ సి డా.ప్రసాద్, హెచ్,వి జయలక్ష్మి, ఎ.యన్.మ్‌లు , ఆశాలు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు అధ్యాపకురాలు సునీత కు పీ.హెచ్.డీ



**మునునూరు, మే 18 ప్రభాతవార్త=** తెలుగు అధ్యాపకురాలు డాక్టరేట్ సాధించిన విషయం పై సోమవారం ఆ ప్రాంతంలో ఆనందోత్సాహాలు వ్యక్తం అవుతున్నాయి.మండలంలోని లోపూడి గ్రామానికి చెందిన ముసునూరు జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ సతీమణి యలమర్తి సునీత జిల్లాలోని బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. ఇటీవల ఆమె ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్.ఎన్.వి కృష్ణారావు నేతృత్వంలో మేరీ కృపా బాయి-కథా నీరాజనం-పరిశీలన అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి, థీసిస్ సమర్పించారు. సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పీ.హెచ్.డీ పట్టాను స్వీకరించారు. డాక్టర్.సునీత పీహెచ్ డీ కి ఎంపికైన సమాచారంతో స్వగ్రామం లోపూడి అంతటా హర్షం వ్యక్తంచేశారు.పలువురు మేధావులు, విద్యావేత్తలు ఆమెకు అభినందనలు తెలుపుతున్నారు.

## పెరిగిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి



**ఇరగవరం మే 18 ( ప్రభాత వార్త)** పెంచిన పెట్రోలు, డీజిలు, గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఎం పార్టీ మండల కమిటీ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నాడు ఇరగవరం లో రాస్తారోకో నిర్వహించినారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ కామన మునిస్వామి మాట్లాడుతూ దేశ ప్రధాని మోడీ గత వారం రోజుల నుండి ప్రజలకు నీతి సూత్రాలు బోధిస్తూ పొదుపును పాటించాలి ప్రజారా రవాణాన్ని ప్రజలు ఉపయోగించుకుంటూ సొంత వాహనాల వాడకాన్ని తగ్గించుకోవాలని పితబోధ చేశారని అన్నారు. ఇప్పుడు పెట్రోలు డీజీలు ధరలను పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపారని తెలిపారు. దేశంలో ప్రపంచంలో యుద్ధ వాతావరణం జరగడం ప్రజలు పై ఆర్థిక భారాలు మోపడానికి అవకాశం కలిగిందని అన్నారు .ప్రజలను పరిపాలించేవారు ప్రజల యొక్క ఆర్థిక భారాలను తగ్గించే వారై ఉండాలని నీతి సూత్రాలు బోధించే సాధువులు కాకూడదని మునిస్వామి అన్నారు .పెరిగిన పెట్రోలు డీజీలు గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఇల్లందపర్తి సత్యనారాయణ తామరపల్లి మునలయ్య, పుణ్యామంతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయం 'ముంగిట' మురుగు..
## తాడిచర్ల అధికారుల నిర్లక్ష్యం!



**కామవరపుకోట, మే 18 (ప్రభాతవార్త):**
కామవరపుకోట మండలం తాడిచర్ల గ్రామ సచివాలయ పరిసరాల్లో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ప్రజలు, ఉన్నతాధికారులు నిత్యం వచ్చి వెళ్లే సచివాలయానికి ఎదురుగానే మురుగునీరు నిలిచిపోయి అధ్వాన్నంగా మారింది. ఇక్కడి విద్యుత్ స్తంభం, తాగునీటి పైపుల వద్ద డ్రైనేజీ నీరు ప్రవహించకుండా నిల్వ ఉండిపోవడంతో ఆ ప్రాంతమంతా మురుగుకూపాన్ని తలపిస్తోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో కుళ్ళిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది.మురుగు నీటిలోనే తాగునీటి పైపులు మునిగి ఉండటంతో ఎక్కడ నీరు కలుషితమై రోగాల బారిన పడతామోనని స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పక్కనే విద్యుత్ స్తంభం ఉండటం కూడా ప్రమాదకరంగా మారింది. ఊరి సమస్యలను తీర్చాల్సిన సచివాలయం ముందే ఇలాంటి దుస్థితి ఉన్నా.. పంచాయతీ అధికారులు, సిబ్బంది కనీసం పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీఓ ఎమ్. సరళ కుమారి స్పందిస్తూ.. తాడిచర్ల సచివాలయం వద్ద ఉన్న సమస్యపై తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానిక పంచాయతీ కార్యదర్శిని, సచివాలయ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.గ్రామస్థులకు ఇబ్బంది లేకుండా మురుగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

## వీరమల్లునరసింహారావు,బండి లక్ష్మిలకు శెట్టిబలిజ సంఘం సత్కారం



**కైకలూరు, మే 18 (ప్రభాతవార్త)** కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కి ఇటీవల రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శిగా, అన్నవరం దేవస్థానం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి ధర్మకర్తల మండలి సభ్యురాలిగా బండి లక్ష్మిలు నియమితులైన సందర్భంగా సోమవారం కైకలూరు పట్టణంలోని ఎన్జీవోస్ భవనం నందు కైకలూరు నియోజకవర్గ శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్కారం నిర్వహించారు. వారితో పాటు కైకలూరు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు పంది రాధాకృష్ణ, మూలలంక సొసైటీ బ్యాంక్ చైర్మన్ మామిడిశెట్టి నారాయణలకు సత్కారం చేశారు.ఈ కార్యక్రమానికి గ్రామీణ వైద్యులు గెద్దాడ సూర్య ప్రకాష్ సభాధ్యక్షత వహించారు.ఈసందర్భంగా ఏలూరు జిల్లా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బండి తులసిరావు మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర స్థాయిలో వీరమల్లు నరసింహారావుకి పదవి ఇవ్వడం అభినందనీయం అన్నారు. అదేవిధంగా అన్నవరం దేవస్థానం సభ్యురాలుగా తన సతీమణి బండి లక్ష్మికి పదవి రావడానికి కృషి చేసింది వీరమల్లు నరసింహారావు అని సభ పూర్వకంగా తెలిపారు.కష్టపడితే పార్టీలో పదవులు వస్తాయని చెప్పడానికి నరసింహారావు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గుత్తుల ఈశ్వరరావు, బొక్కా వెంకట్రావు, పెచ్చెట్టి శ్యామలరావు,మరీదు రాఘవరావు, బొల్లా శ్యామలరాజు గౌడ్, న్యాయవాది చింతపల్లి జయప్రకాష్,తదితరులు పాల్గొన్నారు.

# ధరలు పెరుగుదల.. సామాన్యులపై తలపై గుదిబండ.
## మాజీ మంత్రి కారుమూరి.



**తణుకు , మే 18 ( ప్రభాత వార్త)** పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల నెత్తిన చంద్రబాబు సర్కారు గుదిబండ మోపిందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. పెట్రోలు, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ తణుకులో మాజీ మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని సంక్షేమం ఇచ్చిన పరిస్థితుల్లో సైతం టీడీపీ నేతలు బాదుడే బాదుడు అంటూ తిరిగారని విమర్శించారు. మేము వస్తే పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పి నేడు మాట తప్పి పెంచేశారని, మరొక్కసారి పెంచే దిశగా పావులు కదుపుతున్నారని మండిపడ్డారు. పక్క రాష్ట్రాల్లో 14 శాతం ఉన్న వ్యాట్ ట్యాక్స్ స్థానంలో ఏపీలో మాత్రం 31 శాతంగా ఉందని, మరొక రూ. 5లు సర్‌చార్జ్‌లు వేసి మరీ బాదేస్తున్నారని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ అంటూ బాకాలు ఊదారని కానీ నేడు సూపర్ సిక్స్ ఇవ్వకపోగా బాదుడుకు తెరతీశారని దుయ్యబట్టారు. నీకు రూ. 15వేలు అన్న మంత్రి నేడు సైకిల్ తొక్కుతూ నాలుగు వాహనాలను వెనుక పెట్టుకుని వీడియోలు తీయించుకుంటూ ప్రచారాలకు తెరతీశారని, నేడు నిరుద్యోగ భృతి ఏమైందని, ఆడ బిడ్డ నిధి ఏమైందని ప్రశ్నించారు. పీ ఫోర్‌తో ఉద్ధరిస్తామని చెప్పారని ఎందరికి సాయం అందించారో చెప్పాలని డిమాండ్ చేశారు. అసలే ఫ్రీ బస్సులతో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరల పెట్రోలు, డీజిల్ పెంచి వారి ఉపాధికి గండి కొట్టారని అన్నారు. గతంలో వాహన సదుపాయాలు లేని సమయంలో తమ ప్రయాణాల్లో ఎడ్ల బండ్లు, గుర్రాలను ఉపయోగించేవారని కానీ నేటి చంద్రబాబు సర్కారులో తిరిగి అదేరోజులు తీసుకువస్తున్నాయని తెలిపేందుకు ర్యాలీలో ఎడ్ల బండ్లు, గుర్రాలతో నిరసన తెలిపినట్లు చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కోవిడ్ ఉన్నప్పటికీ కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమం అందించి కూడా కేవలం రూ. 3.32వేల కోట్లు మాత్రమే అప్పు చేయగా, చంద్రబాబు సర్కారు ఏర్పడి రెండేళ్లు పూర్తికాకుండానే రూ. 4 లక్షల కోట్లు అప్పులు చేశారని సంపద సృష్టించడం అంటే ఇదేనా అని ప్రశ్నించారు.

**పెట్రో ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు కదా..**

మా ప్రభుత్వం వస్తే పెట్రోలు ధరలు తగ్గిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీలని నెరవేర్చాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. పక్క రాష్ట్రాల్లో పెట్రోలుపై 14 శాతం వ్యాట్ ట్యాక్స్ ఉంటే మన రాష్ట్రంలో మాత్రం 31 శాతం వ్యాట్ ట్యాక్స్ ఉందని, ఇటువంటి క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ట్యాక్స్‌లు తగ్గించుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. పెట్రోలు విషయంలో మీరిచ్చిన హామీనే మేము అడుగుతున్నామని, ప్రజల తరపున ప్రజా ఘోషను మీకు తెలియచేస్తున్నామని అన్నారు.

**దేశంలో అత్యధికంగా పెట్రోలు ధరలు ఏపీలోనే..**

దేశవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ అత్యధిక ధరలు విక్రయించేది ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమేనని కూటమి ప్రభుత్వం ఆ ఘనత సాధించిందని వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. కూటమి నేతలు ఎన్నికల ముందు సామాన్యులను అనేక సంక్షేమాలు ఆశపెట్టి, మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక గాలికొదిలేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని, బీసీలు, ఎస్సీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని చెప్పి ఇవ్వలేదని మండిపడ్డారు. పెట్రో ధరల పెంపుతో నిత్యావసర సరుకుల ధరలు మరింత పెరుగుతాయని, ఏపీలో సామాన్యుల బతుకు బారంగా మారిందని స్పష్టం చేశారు. ఇటువంటి కారణాలతో స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా వెళ్లలేని స్థితిలో కూటమి ఉందని ఎద్దేవా చేశారు.

**హోరెత్తిన ర్యాలీ...**

పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుతో తణుకులో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీ విజయవంతమైంది. తణుకు సజ్జాపురంలోని పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరిన ర్యాలీ రాష్ట్ర పతి రోడ్డు, నరేంద్ర సెంటర్ మీదుగా తహసిల్దారు కార్యాలయానికి చేరింది. కారుమూరి పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్రగా నిర్వహించిన ఈ ర్యాలీ ప్రజలు స్వాగతించారు. ముఖ్యంగా ర్యాలీలో కూటమి నేతలకు కనువిప్పు కలిగే విధంగా ఎడ్ల బండ్లు, గుర్రాలు, గ్యాస్ బండలతో వినూత్నంగా నిర్వహించారు. అనంతరం తణుకు తహసిల్దారు దండు అశోక్‌వర్మకు పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలంటూ వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పంచాయితీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, లీగల్‌సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెలగల సాయిబాబారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ హబీబుద్దీన్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ యిండుగపల్లి బలరామకృష్ణ, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, అత్తిలి ఏఎంసీ మాజీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ మారిశెట్టి శివశంకర్, నియోజకర్గ ప్రచారకమిటీ అధ్యక్షుడు గెల్లా జగన్, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సబ్బితి రాజేష్, ఇరగవరం మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు తాతపూడి బోసు, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి, మమతాయాదవ్, ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు పెనుమాల రాజేష్ పాల్గొన్నారు.



## అండర్ 16 క్రికెట్ టీంకి ఆల్రౌండర్‌గా
## సుంకర శ్రీసూర్యతేజ

**ఏలూరు, మే 18, (ప్రభాత వార్త)** ఏలూరు భాష్యం స్కూల్ కు చెందిన విద్యార్థి సుంకర శ్రీ సూర్య తేజ అండర్ 16 క్రికెట్ టీం కి ఆల్రౌండర్ గా ఎన్నికయ్యారు. సూర్య తేజ ప్రస్తుతం ఏఎన్ఎం క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతూ పశ్చిమగోదావరి జిల్లా అండర్ 16 క్రికెట్ టీం కు ఆల్ రౌండర్ గా ఎన్నిక కావడం పట్ల అకాడమీ విద్యార్థులు, భాష్యం స్కూల్ విద్యార్థులు సూర్యతేజకు అభినందనలు తెలిపారు.

# రేపు మందులు షాపులు బంద్

**చాట్రాయి, మే 18 ప్రభాతవార్త** అఖిలభారత కెమిస్టుల సమాఖ్య పిలుపుమేరకు బుధవారం దేశవ్యాప్తంగా మందులు షాపులు సమ్మె చేస్తున్నట్లు మండల యూనియన్ నాయకులు గోళ్ళ సత్యనారాయణ తెలియజేశారు. ఆన్లైన్ లో మందుల అమ్మకాలను నిలిపివేయాలని, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నిలిపివేయాలని, నకిలీ మందుల నమ్మకాన్ని నివారించాలని సమైక్య డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీనిపై నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

## శ్రమ జీవులకు సేవ చేయటమే ధర్మ మార్గం యస్ఐ జయ బాబు



**టి నరసాపురం మే 18 ప్రభాతవార్త** టీ నర్సాపురం పంచాయతీ లోని గండిగూడెం చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న సుమారు 200 మంది కూలీలకు టి. నరసాపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ జయ బాబు సోమవారం తన సొంత ఖర్చులతో ప్రత్యేకంగా తయారు చేయించిన లస్సీ, మజ్జిగ పంపిణ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ జయ బాబు మాట్లాడుతూ శ్రమజీవులకు సేవ చేయటం ధర్మమార్గమని అన్నారు. ఉపాధి హామీ ప్రత్యేకత, ప్రభుత్వాల సహకారం, ప్రజల బాధ్యత అనే అంశాలపై కూలీలకు అవగాహన కల్పించారు.వేసవి కాలంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని అన్నారు దొంగతనాల నివారణకు అప్రమత్తంగా ఉండాలని, రాజీ మార్గమే రాజ మార్గంగా భావించి వివాదాలను గౌరవప్రదంగా పరిష్కరించుకోవాలని సూచించారు

పోలీస్ అంటే భయం కాదు, భరోసా అనే నినాదంతో టీ నర్సాపురం పోలీసులు ప్రజలతో మమేకమై పనిచేస్తున్నారని సామాజిక కార్యకర్తలు కొనియాడారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా ఉపాధి కూలీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోసామాజిక కార్యకర్తలు యస్.డి. నాసర్ పాష ,కొరివి శేషారావు, పింగుల మధు, కొరివి నాగేశ్వరరావు, తలకొండ నాగబాబు, యాదాల వెంకన్న, కొక్కండ భూషణం, పింగుల చిన్నారి, ఆరోగ్య సిబ్బంది లక్ష్మీ మంగ, సృజన, శ్రీరామమూర్తి, కాకాని వెంకటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు తదితరలు పాల్గొన్నారు.

# పుస్తక పఠనం ద్వారా మంచి విజ్ఞానం పొందవచ్చు



**పెనుమంట్ర, మే-18, (ప్రభాతవార్త)** పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు, మంచి విజ్ఞానం పొందాలని రిసోర్స్ పర్సన్ కె. ఆదాము అన్నారు.వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెనుమంట్ర శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు ప్రపంచ అట్లాస్ గురించి అవగాహన కల్పించారు. ప్రపంచ భాగోళం లో, వనరులు, పఠలు అందులోని వివిధ అంశాలు ప్రాధాన్యతను గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం విద్యార్థులు ఇండోర్ గేమ్స్ ఆడించడమైనది. ఈ కార్యక్రమానికి చదువరులు విద్యార్థులు గ్రంథపాలకుడు డి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ కలయిక ... అనుబంధాల వేదిక

### 31 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**తాడేపల్లిగూడెం,మే 18 (ప్రభాతవార్త)** తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1995 – 96 బ్యాచ్ విద్యార్థులు 31 ఏళ్ల సంవత్సరాల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. వివిధ రంగాల్లో, వృత్తుల్లో స్థిరపడి సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన చిన్ననాటి స్నేహితులందరూ ఎంతో ఉత్సాహంగా తమ కుటుంబ సభ్యులతో తరలివచ్చి ఎంతో ఆప్యాయతగా పలకరించుకున్నారు. ఒకరి యోగ క్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధురస్మృతులను, పాత క్షణాలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో ఉన్న ఆత్మీయ సాన్నిహిత్యాన్ని నెమరు వేసుకున్నారు. ఉపాధ్యాయులతో తమ చిన్ననాటి మధుర క్షణాలను, స్మృతులను తలచుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో, కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. పాత స్నేహితులతో కరచాలనం, ఆత్మీయ పలకరింపులతో పాటు స్వీయ చిత్రాలు తీసుకుంటూ ఆయా మధురస్మృతులను తమ తమ చారవాణిలలో భద్రపరుచుకున్నారు. ఆనాటి స్నేహితులందరూ మళ్లీ ఒకసారి కలుద్దామని ఎప్పటి నుంచో ప్రయత్నిస్తే ఇప్పటికీ తమ కృషి ఫలించిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. మూడు దశాబ్దాల తరువాత కలుసుకున్న ఈ అపూర్వ కలయిక ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని, చిన్ననాటి స్నేహాన్ని మళ్లీ చిగురింపజెసిందని, ఈ మధురమైన, మరుపురాని స్నేహబంధాన్ని భవిష్యత్తులోను కొనసాగిస్తామని పూర్వ విద్యార్థులు చెప్పారు. ఈ సందర్భంగా తమకు ఎంతో క్రమశిక్షణ, అక్షర జ్ఞానంతోపాటు విద్యాబుద్ధులు నేర్పిన గురవర్యులు మద్దిపాటి సత్యనారాయణ, చింతా వీర్రాజు, వేములపల్లి జయ, నున్నా సత్యం ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో ఎంతో ఘనంగా సత్కరించారు. గురువుల నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. గురువులతో స్వీయచిత్రాలు దిగుతూ భావోద్వేగానికి గురయ్యారు. తమ ఉన్నతికి ఎంతగానో దోహదపడిన సరస్వతి నిలయం పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయాన్ని అందిస్తామని పూర్వ విద్యార్థులందరూ తీర్మానం చేసుకున్నారు. తమ మిత్రుడు సూరే సురేష్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా తోటి మిత్రులందరూ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేయడంతోపాటు సురేష్ ను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ ఆపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి స్థలాన్నిచ్చి సహకరించిన ఎస్.ఎస్.వి.సత్యనారాయణ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. చివరిగా చెమర్చిన కళ్ళతో (జగ్గన్నపేట–రామన్నగూడెం) పూర్వవిద్యార్థులు వీడ్కోలు పలికించిన తీరు చిన్ననాటి మిత్రుల హృదయాలను ఎంతగానో కదిలించటం విశేషం.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**చాట్రాయి, మే 18 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇజ్జి గాని వెంకటేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు. చాట్రాయి మండలానికి చెందిన వివిధ గ్రామాల లబ్ధిదారులు అనారోగ్యంతో ఆసుపత్రలో చికిత్స పొందగా వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి పైకాన్ని చెక్కుల రూపంలో అందిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. మండలంలో 12 మంది లబ్ధిదారులకు గాను మూడు లక్షల 86 వేల 759 విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంపసాటి చెన్నారావు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పి అంకంపాలెంలో శక్తి యాప్, మహిళల భద్రతపై అవగాహన సదస్సు



**జీలుగుమిల్లి, మే-18, (ప్రభాతవార్త)** మండలంలోని పి అంకంపాలెంలో జీలుగుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఎస్ ఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గ్రామ ప్రజలకు, మహిళల భద్రతకు శక్తి యాప్ గురించి, యువతకు మాదకద్రవ్యాల పట్ల పోక్సో చట్టాలపై అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం పోలీస్ శాఖ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించింది.

**వాలీబాల్ విజేతలకు కూరం ప్రసాద్ నగదు బహుమతి:-**

మండలంలో పి అంకంపాలెంలో మండల పోలీస్ శాఖ నిర్వహించిన శక్తి యాప్ పై అవగాహన, పల్లెనిద్ర కార్యక్రమాల భాగంగా పోలీసు నిర్వహించిన పురుషులకు వాలీబాల్ పోటీలలో విజయం సాధించిన టీం క్రీడాకారులకు జీలుగుమిల్లి మెడికల్ డిపార్ట్మెంట్ ఉద్యోగి కూరం ప్రసాద్ రూ. 5000/–, నగదు బహుమతి అందించి సమాజ సేవ పట్ల తనకున్న సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దేశ బంగారు భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని అన్నారు. అలాంటి యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా విద్య, ఉపాధి, క్రీడల వైపు దృష్టి సారించాలని కోరారు. అనంతరం క్రీడలలో గెలుపొందిన విజేతలకు సి ఐ, వెంకటేశ్వరరావు, ఎస్సై క్రాంతి కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాలి శ్రీను గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# అప్పుడు దాచుకున్నారు..

### ఇప్పుడు దోచుకుంటున్నారు

### పెట్రోల్ డీజిల్ ధరలపై ముదునూరి నిరసన



**నరసాపురం మే 18 ప్రభాతవార్త** పట్టణంలో వైయస్సార్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పెట్రోల్ డీజిల్ ధరలకు నిరసనగా ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు నాయకత్వంలో భారీ స్థాయిలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్నికల ముందు ప్రచారంలో రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే పెట్రోలు డీజిల్ ధరలు తగ్గిస్తామని రాష్ట్ర సస్ నుంచి మినహాయింపు ఇస్తామని చంద్రబాబు నాయుడు లోకేష్ చేసిన వాగ్దానాలు ఈనాడు ఏమయ్యాయని ప్రసాదరాజు ప్రశ్నించారు. పెట్రోల్ డీజిల్ ధరలు లీటర్కు మూడు రూపాయలు పైగా పెంచడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ధరలను కేంద్రం పెంచిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉందని అందువల్ల ఈ పెంపుదలకు వారు బాధ్యత వహించాలన్నారు. ఎన్నో కల్లబొల్లి వాగ్దానాలు మోసపు మాటలు చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని ఇవన్నీ ఇప్పుడు గాలికి వదిలేసారు అన్నారు. నిన్న మొన్నటి వరకు పెట్రోల్ డీజిల్ దారుణంగా దాచుకొని క్యూ లైన్ లలో జనానికి నానా నరకం చూపించి ఇప్పుడు అధిక ధరలకు అమ్ముకుని దోచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధిక ధరలపై ప్రజా సమస్యలపై వైసిపి ఆందోళన చేస్తుందన్నారు. పక్క రాష్ట్రంలో కంటే ఏపీలో అధిక ధరలకు పెట్రోల్ డీజిల్ అమ్ముతున్నారని విమర్శించారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బి వెంకటరమణ వై కేఎస్ మండల పట్టణ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో దాసిరాజుకు వినతిపత్రం ఇచ్చారు.

# భీమా సొమ్ము అందజేత



**చాట్రాయి, మే 18, ప్రభాతవార్త** చాట్రాయి మండలం,పోలవరం సొసైటీలో అప్పు తీసుకున్న జగ్గవరపు సుధాకరరెడ్డి బైకు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. సంఘం ద్వారా ఇన్సూరెన్సు చెల్లించి ఉన్నందున ఇన్సూరెన్సు పైకం 2 లక్షల రూపాయలు సుధాకర రెడ్డి భార్య సుజాతకు సంఘం అధ్యక్షులు యర్రా ప్రసాద్ చేతుల మీదుగా సోమవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఒంటిపూట మంచినీటి సరఫరా

**అత్తిలి, మే 18( ప్రభాతవార్త )** అత్తిలి గ్రామపంచాయతీ వద్ద గల మంచినీటి చెరువులో నీటిమట్టం తగ్గిన కారణంగా అందుబాటులో ఉన్న నీటిని తాత్కాలికంగా కాలువలకు నీరు వచ్చునంత వరకు ప్రతీరోజు ఉదయం ఒక పూట మాత్రమే నీటిని సరఫరా చేస్తారని పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. ప్రజలందరూ నీటిని పొదుపుగా అవసరం మేరకు వినియోగించుకోవలసిందిగా కోరారు.రామన్న పేట, పెద్ద పేట ట్యాంకుల నుండి యధావిధిగా రెండు పూటలు మంచినీటి సరఫరా చేస్తారని తెలిపారు.

## ఇండ్ల స్థలాలు చూపించాలంటూ వినతి



**ఇరగవరం, మే 18( ప్రభాత వార్త )** ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చినప్పటికీ ఇంతవరకు తమకు స్థలాలు చూపించలేదంటు లబ్ధిదారులు ఇరగవరం తాసిల్దార్ కు వినతిపత్రాన్ని అందజేశారు. తమకు స్థలాలు ఇవ్వకుండానే రోడ్లు వేశామని, మంచినీటి ట్యాపులు ఏర్పాటు చేశామని చెబుతున్నారని అవి ఎక్కడ ఏర్పాటు చేశారో తెలియజేయాలని ఇరగవరం ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. కేటాయించిన స్థలాల్లో మట్టిపూడిక చేయించాలని కోరుతూ వినతిపత్రాన్ని ప్రజా విజ్ఞప్తిల పరిష్కార వేదికలో దరఖాస్తు అందజేసినట్లు ఎంపీడీవో ఏ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కామన మునుస్వామి, ఇల్లెందులపర్తి సత్యనారాయణ, రేలంగి గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయండి



**అత్తిలి, మే 18( ప్రభాతవార్త )** ఉపాధి హామీ పనులకు తగినన్ని నిధులు కేటాయించాలని ఈనెల 20 నుండి 25 వరకు గ్రామ సచివాలయాల వద్ద జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కం శెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు బళ్ళ చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్తిలి మండలం వరిగేడు గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, వీరభద్రరావు మాట్లాడుతూ కూలీలకు ఉపాధి లేకుండా నష్టం కలిగిస్తున్న ఫేస్ యాప్ ను తక్షణం రద్దు చేయాలని, రెండు పూటల ఫోటో హాజరు విధానాన్ని రద్దు చేయాలని, పని చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలనికోరారు.ఉపాధి హామీకి మన రాష్ట్రానికి పదివేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేసారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సానబోయిన సత్యనారాయణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చూడాలి

**నరసాపురం మే 18 ప్రభాతవార్త** నరసాపురం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో సోమవారం నీటి సరఫరా శాఖ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నరసాపురం నియోజకవర్గంలోని తాగునీటి సమస్యలు, నీటి సరఫరా సౌకర్యాలు మరియు ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా సీపీడబ్ల్యూ పథకం అమలుపై అధికారులు మరియు సిబ్బందితో ఎమ్మెల్యే నాయకర్ పిన్‌పాయింట్ స్థాయిలో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ఎక్కడైనా నీటి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో నరసాపురం, మొగల్తూరు మండలాలు మరియు నరసాపురం పట్టణానికి చెందిన అన్ని నీటి సరఫరా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అత్తిలిలో ఉచిత కంటి వైద్య శిబిరం



**అత్తిలి, మే 18 (ప్రభాతవార్త)** తణుకు శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాల లో భాగంగా అత్తిలి లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొరిపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో బాలికోన్నత పాఠశాలలో అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, కంటి వైద్య నిపుణులు కంటి రోగులను పరీక్షించారు. 350 మందిని పరీక్షించగా వారిలో 304 మందికి కళ్ళజోళ్ళు అవసరమని గుర్తించారు. 20 మందికి ఐఓఎల్ శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ణయించారు. వీరందరికీ తణుకు శాసనసభ్యుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఉచితంగా కళ్ళజోళ్ళు,శస్త్ర చికిత్సలు జరుగుతాయని ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్, బిజెపి నాయకులు త్రిమూర్తులు, నాగబాబు, మండల టిడిపి అధ్యక్షుడు పోలిశెట్టి చందు, కార్యదర్శి ఆల్తి అజయ్, ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్టీ ఆల్తి సత్యనారాయణ, అత్తిలి సొసైటీ అధ్యక్షుడు పోలిశెట్టి గోపికృష్ణ, టిడిపి నాయకులు ఆనాల ఆదినారాయణ రావు, కొరిపల్లి హరి, గొలగాన రాజు, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని విజయలక్ష్మి, పాఠశాల కమిటీ చైర్మన్ బొంతు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# రేపే మందుల షాపుల బంద్

### అత్యవసరం మందులు ముందే కొనుక్కోమని వినతి



**నరసాపురం మే 18 ప్రభాతవార్త** అఖిల భారత కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ సమాఖ్య ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఇచ్చిన మెడికల్ షాపుల బంద్ జయప్రదం చేయాలని ఇందులో భాగంగా నరసాపురం మందులు షాపులు అన్నిటిని బందు చేస్తామని ఆ సంఘ అధ్యక్షులు సిహెచ్ ఉమా నాగేశ్వరరావు నాగు తెలిపారు. తమ డిమాండ్స్ లు ప్రభుత్వం అంగీకరించాలని ప్రజల యొక్క ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. ఆన్లైన్లో మందుల విక్రయాన్ని నిలిపివేయాలని కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్ లు నిలిపివేయాలని నకిలీ ముందుల అమ్మకాన్ని నివారించాలని కోరారు. ప్రజలు బంధు జయప్రదం చేయాలని కోరారు.

## గడువులోగా పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి: తహిశీల్దార్ జి. ఎలీషా



**కామవరపుకోట, మే 18(ప్రభాత వార్త):** మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి 4 అర్జీలు అందినట్లు తహశీల్దార్ జి. ఎలీషా తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒకటి, పంచాయతీ రాజ్ పరిధిలో రెండు, అలాగే వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి ఒక అర్జీ నమోదయ్యాయని ఆయన వివరించారు. నిర్దేశిత గడువులోగా ఈ సమస్యలన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించాలని మరియు బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను తహశీల్దార్ ఆదేశించారు.

## రెండేళ్లలోనే రూ.8.50 కోట్ల అభివృద్ధి: కిలారు సత్యనారాయణ



**కామవరపుకోట,మే 18(ప్రభాతవార్త):** ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, ఎంపి పుట్టా మహేష్‌కుమార్‌ల చొరవతో కామవరపుకోట మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో కేవలం రెండేళ్ల ఎన్డీఏ కూటమి పాలనలో రూ. 8.50 కోట్లతో రికార్డు స్థాయిలో సీసీ రహదారుల నిర్మాణం పూర్తి చేసినట్లు టిడిపి మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంత తక్కువ సమయంలో భారీ నిధులతో రోడ్లను పూర్తి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.మండల కేంద్రమైన కామవరపుకోటతో పాటు గుంటుపల్లి, పోలాసిగూడెం, తాడిచెర్ల, ఆడమిల్లి, కళ్లచెర్వు, సాగిపాడు, రావికంపాడు, తడికలపూడి, అంకాలంపాడు, రామన్నపాలెం, తూర్పు యడవల్లి, ఉప్పలపాడు, వీరిశెట్టిగూడెం, కేఎస్.రామవరం గ్రామాల్లో అంతర్గత సీసీ రహదారులను సుందరంగా తీర్చిదిద్దినట్లు ఆయన వివరించారు.రోడ్లతో పాటు కేఎస్.రామవరం, రావికంపాడుల్లో డ్రెయినేజీ వ్యవస్థను, కళ్లచెర్వులో స్మశానవాటికను నిర్మించామన్నారు. మెట్ట ప్రాంత ప్రజల చిరకాల కోరికైన తడికలపూడి – రావికంపాడు బీటీ రోడ్డును రూ.4 కోట్లతో , కొత్తగూడెం అడ్డరోడ్డు నుండి రాజుపోతేపల్లి అడ్డరోడ్డు వరకు రూ.1.63 కోట్లతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే ఆశన్నగూడెం గుండేరు వాగు బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా కూటమి ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేస్తామని కిలారు స్పష్టం చేశారు.

## వృద్ధ దంపతుల పై దాడి చేసిన వారిపై కేసు నమోదు



**మొగల్తూరు మే 18 (ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరు పోలీస్ స్టేషన్ ఎస్సై జి వాసు తెలిపిన వివరాల ప్రకారం, కొత్తట గ్రామానికి చెందిన, కోపనాతి సూర్యనారాయణ, భార్య కస్తూరి బాయ్ పై ఈనెల 16వ తేదీన వారి కుమారుడు ముత్యాలరావు , భార్య గోవిందమ్మ, మనవడు రాధాకృష్ణ, మనవరాలు స్వర్ణ, కోపనాతి శేఖర్ లు కలిసి ఆస్తికోసం ఈ వృద్ధ దంపతులను విచక్షణారహితంగా కొట్టారు, అదే రోజు బాధితులు ఫిర్యాదు చేయగా, దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై జి వాసు తెలియజేశారు

# చట్టబద్ధ దత్తత ద్వారా అనాథ చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు

- 9 నెలల చిన్నారికి ఇంచార్జి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఫైనల్ దత్తత ఉత్తర్వుల అందజేత
- అక్రమంగా పిల్లల కొనుగోలు, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటాం
- ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



**భీమవరం, మే 18 ( ప్రభాత వార్త)** జిల్లా శిశు గృహ కేంద్రంలోని ప్రత్యేక దత్తత విభాగంలో ఆశ్రయం పొందుతున్న 7 నెలల వయస్సు గల ఆడ శిశువును ఈ ఏడాది మార్చి 17న కర్ణాటక రాష్ట్రానికి చెందిన దంపతులు చట్టబద్ధంగా దత్తత స్వీకరించినట్లు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ సిఎఆర్ఎ నిబంధనల ప్రకారం దత్తత ప్రక్రియ పూర్తయిన అనంతరం 60 రోజులలోపు జిల్లా కలెక్టర్ ద్వారా ఫైనల్ దత్తత ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం భీమవరం జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి దత్తత తల్లిదండ్రులకు ఫైనల్ దత్తత ఉత్తర్వులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు దేశవ్యాప్తంగా సిఎఆర్ఎ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దేశవ్యాప్తంగా దత్తత ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగుతోందన్నారు. దత్తత కార్యక్రమం ద్వారా అనాథ పిల్లలకు మంచి కుటుంబ వాతావరణం లభించడంతో పాటు వారి భవిష్యత్తు సురక్షితంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి ప్రేమ, సంరక్షణ, విద్య, భద్రత కలిగిన కుటుంబ వాతావరణం అందించడం సమాజ బాధ్యత అని అన్నారు. చట్టవ్యతిరేకంగా పిల్లలను కొనుగోలు చేయడం, అమ్మకాలు జరపడం వంటి అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా వెలుగులోకి వస్తే సంబంధిత వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తప్పనిసరిగా చట్టబద్ధమైన దత్తత విధానాన్నే అనుసరించాలని సూచించారు. దత్తత అనంతరం పిల్లల యోగక్షేమాలను పర్యవేక్షించేందుకు సంబంధిత దత్తత సంస్థ ద్వారా రెండు సంవత్సరాలపాటు "పోస్ట్ అడాప్షన్ ఫాలోఅప్" ప్రక్రియ అమలు చేయబడుతోందని తెలిపారు. ఫాలోఅప్ నివేదికలను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా అప్లోడ్ చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్, శిశు గృహ మేనేజర్ స్వాతి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సీఎం కార్యాలయానికి జిల్లా నుండి అందిన అర్జీల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి

### ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి



**భీమవరం, మే 18 ( ప్రభాత వార్త)** కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు ఇంచార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సీఎం కార్యాలయం ద్వారా అందిన ప్రజా అర్జీల పరిష్కార విధానాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటికే పరిష్కరించిన పలు అర్జీలకు సంబంధించిన దరఖాస్తుదారులతో జాయింట్ కలెక్టర్ స్వయంగా ఫోన్ ద్వారా మాట్లాడి, సమస్య పరిష్కారం జరిగిన తీరును, వారి సంతృప్తి స్థాయిని తెలుసుకున్నారు. అర్జీదారుడు తన దరఖాస్తులో ఏ విధమైన సమస్యను ప్రస్తావించాడో అధికారులు స్పష్టంగా అర్థం చేసుకొని, అర్జీదారునితో నేరుగా మాట్లాడి పరిష్కార విధానాన్ని వివరించాలని సూచించారు. పరిష్కారం సాధ్యం కాని అంశాల విషయంలో వాస్తవ పరిస్థితులను స్పష్టంగా తెలియజేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే పరిష్కారం పొందిన పలు అర్జీలకు సంబంధించిన దరఖాస్తుదారులతో ఆయన మాట్లాడారు. లి ఆకివీడు మండలం ఐ భీమవరం గ్రామానికి చెందిన గోనిగిత్తల సాత్విక్ ప్రభుత్వ పథకాలకు సంబంధించి సమర్పించిన అర్జీకి సంతృప్తికర పరిష్కారం లభించిందని తెలియజేశారు. అలాగే ఆకివీడుకు చెందిన వర్దినేని లక్ష్మీ వరప్రసాద్ రహదారులపై హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, స్పీడ్ బ్రేకర్ల తొలగింపు, సెంట్రల్ లైన్ పెయింటింగ్ వంటి సమస్యలపై సమర్పించిన అర్జీపై అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నరసాపురం టైలర్‌పేటకు చెందిన దివ్యాంగురాలు మలిపెద్ది ఆదెమ్మ ట్రై మోటార్ సైకిల్ మంజూరుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇంకా అందలేదని తెలియజేయగా, జిల్లా స్థాయి కమిటీ ద్వారా అన్ని దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన వారికి జూన్ మొదటి వారంలో ట్రై మోటార్ సైకిళ్లు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. పెనుగొండ మండలం దొంగరావిపాలెం గ్రామానికి చెందిన మాక రేణుక విద్యుత్ మీటర్ మరియు బిల్లులకు సంబంధించిన సమస్యపై దరఖాస్తు చేసుకోగా, అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించారని ఆమె సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు. అలాగే పెనుగొండ మండలం మూలపర్రు గ్రామానికి చెందిన నార్ని లక్ష్మీ తులసి ఆక్రమణల తొలగింపు విషయమై, దొంగరావిపాలెం గ్రామానికి చెందిన మాక రేణుక గృహ నిర్మాణ బిల్లుల చెల్లింపులపై, అత్తిలికి చెందిన వడ్డీ మాధురి లత అసైన్‌మెంట్ భూమికి సంబంధించి సమర్పించిన అర్జీలకు అధికారులు తగిన పరిష్కారం చూపినట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. పీజీఆర్ఎస్ ద్వారా అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా, అర్జీదారుని సంతృప్తి మేరకు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఒకసారి పరిష్కారం చూపిన అర్జీ మళ్లీ అదే కారణంతో తిరిగి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సహకార సంఘం ఉద్యోగులు నిరసన



**మొగల్తూరు మే 18 (ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామం మసీదు సమీపంలో ఉన్న జిల్లా సహకార సంఘం ఎదుట ఉద్యోగులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ2025 సంవత్సరం డిసెంబరు ఆరో తారీకు నుండి ఫిబ్రవరి 25వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘం ఉద్యోగులు తమ న్యాయమైన కోరికలు పరిష్కరించాలని వివిధ దశల్లో ఆందోళన కార్యక్రమాలు చేసి తప్పనిసరి పరిస్థితుల్లో నిరవధిక సమ్మె చేయడం జరిగింది ఆ సందర్భంగా రాష్ట్ర సహకార శాఖ మంత్రి అచ్చం నాయుడు మరియు ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మీ న్యాయమైన కోరిక పరిష్కరిస్తాం మీరు సమ్మె విరమణ చేయండి అని వాగ్దానం చేయగా వారి మాటలు నమ్మి సమ్మె విరమణ చేయడం జరిగింది కానీ రాష్ట్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర కమిషనర్ సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోగా సహకార సంఘం ఉద్యోగులు హక్కులకు ప్రస్తుతం పొందుతున్న ఉద్యోగ సదుపాయాలకు నష్టం కలిగించే విధంగా జీవో నెంబర్ 322 విడుదల చేసి ఉద్యోగులను మోసం చేయడం జరిగింది . అటువంటి మోసపూరిత చర్యను నిరసిస్తూ జిల్లా సహకార బ్యాంకు బ్రాంచ్ మొగల్తూరు వద్ద బ్రాంచ్ ఏరియాలోని సహకార సంఘం ఉద్యోగులు నిరసన తెలియజేసి జీవో కాపీ దగ్ధం చేయడం జరిగింది అనంతరం బ్రాంచ్ మేనేజర్ కు వినతిపత్రం అందించడం జరిగింది